క్లుప్తంగా

జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ల కేటాయింపు


ప్లాట్ల కేటాయింపు ప్రక్రియ చేపడుతున్న అధికారులు

సాలూరు: పట్టణంలో బుడా ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్లను లబ్ధిదారులకు కేటాయించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ అధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో అధికారులు ఆన్‌లైన్ లాటరీ ప్రక్రియ ద్వారా లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. 20 శాతం రాయతీపై నలుగురుకి, మిగిలిన 12 మందికి సాధారణ రీతిలో ప్లాట్లను కేటాయించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, కమిషనర్ ప్రసన్నవాణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాల్సిందే...


ఆదివాసీ సంఘ సభ్యుల ర్యాలీ

పార్వతీపురం: షెడ్యూల్–5 ప్రాంతానికి ప్రత్యేక నోటిఫికేషన్ ఇచ్చి గిరిజనులతోనే ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ కె. ధర్మారావు కోరారు. ఈ మేరకు పట్టణంలో గిరిజనులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డీఎస్సీ–2024 ఉపాధ్యాయ నియమకాల్లో షెడ్యూల్–5లోని పోస్టులు కలపడం వల్ల గిరిజనులు నష్టపోతారన్నారు. ఆదివాసి ప్రాంతంలో నివసించే గిరిజనులకు ప్రత్యేక డీఎస్సీని నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు గిరిజన నాయకులు, యువత పాల్గొన్నారు

కరోనాపై అప్రమత్తం


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మక్కువ: కరోనాపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవడంతో పాటు జాగ్రత్తలు పాటించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మంజులవీణ అన్నారు. మండలంలోని ములక్కాయవలసలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వ్యాధులు దరిచేరవని అన్నారు. అనంతరం విద్యార్థులు గ్రామంలో ఇంటింటికీ మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

పార్వతీపురం టౌన్: ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ పీడీ వై. సత్యంనాయుడు అన్నారు. సోమవారం స్థానిక డీఆర్‌డీఏ కార్యాలయం నుంచి ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో జూమ్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వెలుగు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

జీడి, మామిడి సాగులో రైతులకు శిక్షణ

సీతంపేట: జీడీ,మామిడి పంటల్లో యాజమాన్య పద్ధతులపై స్థానిక వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దపేట ఉద్యానవన పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు సంయుక్తంగా రైతులకు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉద్యానవన ప్రిన్సిపాల్ సైంటిస్ట్ భగవాన్ మాట్లాడుతూ.. జీడి,మామిడి పంటల్లో సీజన్‌లో వచ్చే తెగుళ్ల, వాటి నివారణ చర్యలను వివరించారు. విత్తన రకాల ఎంపిక, అంటుకట్టు విధానం, తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సైంటిస్టులు సీతారం, శ్రీనివాసరాజులు, లక్ష్మీనారాయణ, సురేష్‌కుమార్, పీహెచ్‌ఓ గణేష్, పీఏఓ హరికృష్ణ, హెచ్‌ఓ పి.జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

భాషా వలంటీర్ల ధర్నా


ధర్నా చేస్తున్న భాషా వలంటీర్లు

సీతంపేట: తమ సమస్యలు పరిష్కరించాలంటూ ఐటీడీఏ ఎదుట సోమవారం ఎంఎల్‌ఈ వలంటీర్లు ధర్నా చేశారు. మార్చి, ఏప్రిల్ నెలలు విధుల్లో కొనసాగించాలని, వచ్చే విద్యాసంవత్సరంలో తమను రెన్యువల్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. అనంతరం ఐటీడీఏ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఈ వలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనందరావు, దొంబు, ఎల్లంగు, తదితరులు పాల్గొన్నారు.

కాసాపేటలో అభివృద్ధి పరుగులు..

- లక్షలాది రూపాయలతో భవనాలు
- తాగునీరు, రహదారి సదుపాయాల కల్పన
- అర్హులందరికీ ఇళ్లు
- సంక్షేమ పథకాలతో ఆర్థిక భరోసా


నిర్మాణం పూర్తి కావచ్చిన రామమందిరం

గ్రామంలో చేపట్టిన నిర్మాణాలు, అభివృద్ధి పనులు

- రూ. 40 లక్షలతో రామ మందిరం నిర్మాణం
- రూ.43 లక్షలతో సచివాలయ భవనం
- రూ.23 లక్షలతో ఆర్బీకే భవనం
- రూ. 35 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంక్, పైప్ లైన్లు
- రూ. 26 లక్షలతో సీసీ రోడ్లు, కాలువలు
- రూ. 22 లక్షలతో జగనన్న కాలనీ భూమి కొనుగోలు
- రూ. 1.37 కోట్లతో జగనన్న గృహాలు
- రూ. 30 లక్షలతో పాఠశాలలో అదనపు భవనాలు, మౌలిక సదుపాయాలు

ఆర్థికసాయం...

వైఎస్ఆర్ ఆసరా : రూ. 1,78,37,206
వైఎస్ఆర్ చేయూత : రూ. 1,12 87,500
రైతుభరోసా : రూ 2,03,27,200



సీతానగరం: మండలంలోని కాసాపేట గతంలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉండేది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ప్రజల తలరాతలు మాత్రం మారలేదు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో గత పాలకులు ఘోరంగా విఫలమయ్యారు. తమ సమస్యలను ఎంతోమంది నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమాన్ని రెండుకళ్లుగా భావించి పాలన చేపట్టడంతో గ్రామంలో అభివృద్ధి పరుగులు పెడుతోంది. ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు, రహదారులు, కాలువలు, తాగునీటి సదుపాయం కల్పించడంతో ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రజల వద్దకే పాలన అందించాలనే ఉద్దేశంతో సచివాలయం ఏర్పాటు చేశారు. దీంతో అన్ని పనులూ గ్రామంలోనే జరుగుతున్నాయి. అలాగే రైతులకు సాగుకు సంబంధించిన పూర్తి సహకారం అందించేందుకు రైతుభరోసా కేంద్రం ఏర్పాటు చేశారు. అర్హులైన వారికి ప్రభుత్వమే జిరాయితీ భూమి కొనుగోలు చేసి జగనన్న కాలనీలు మంజూరు చేసింది. దీంతో ఏళ్ల నాటి తమ సొంతింటి కల నెరవేరిందని ప్రజలు చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే ఉద్దేశంతో 'మనబడి నాడు – నేడు'లో భాగంగా అభివృద్ధి పనులు చేపట్టారు. ఇంగ్లిష్ మీడియం అమలు చేయడంతో పాటు డిజిటల్ క్లాసులు నిర్వహిస్తుండడంతో విద్యార్థులు చదువుపై మక్కువ కనబరుస్తున్నారు. జేజేఎం నిధులు రూ. 35 లక్షలతో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నారు. అలాగే రూ. 8 లక్షలతో ఓవర్ హెడ్‌ట్యాంక్‌కు మరమ్మతులు చేపట్టడంతో పాటు ప్రహరీ ఏర్పాటు చేశారు. మరో రూ. 26 లక్షలతో గ్రామంలో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించారు.


నాడు నేడు నిధులతో నిర్మించిన కాసాపేట ప్రాథమికోన్నత పాఠశాల భవనం

మౌలిక వసతులకు ప్రాధాన్యం...



ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే అలజంగి జోగారావు పలు సమస్యలను గుర్తించారు. ముఖ్యంగా మౌలిక వసతులైన కాలువలు, రోడ్లకు లక్షలాది రూపాయలు మంజూరు చేశారు. రామమందిరం నిర్మాణానికి రూ. 40 లక్షలు కేటాయించారు. దీర్ఘకాలంగా అసంపూర్తిగా ఉన్న మంచినీటి ఓవర్ హెడ్‌ట్యాంక్‌ను పునరుద్ధరించి మమ్మల్ని ఆదుకున్నారు. ఇంతటి అభివృద్ధికి తోడ్పడిన జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– తేలు పద్మావతి, పొదుపు సంఘ సభ్యురాలు, కాసాపేట, సీతానగరం

జగనన్నకు ధన్యవాదాలు..



రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో దశాబ్దాల కాలంగా ఎదుర్కొంటున్న సీసీ రోడ్లు, కాలువల సమస్య తీరింది. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు. ఇంటింటికీ కుళాయిలు వేయడంతో తాగునీటి ఇబ్బందులు తీరాయి. ఇంతటి అభివృద్ధికి తోడ్పడిన జగనన్నకు ధన్యవాదాలు.

– టి శ్రీదేవి, గ్రామస్తురాలు, కాసాపేట

అభినందనీయం..



గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం అభినందనీయం. ఏళ్లనాటి సమస్యలను పరిష్కరించడంలో ఎమ్మెల్యే జోగారావు సఫలీకృతులయ్యారు. ప్రభుత్వమే స్థలం సేకరించి ప్రజలకు అందజేసి జగనన్న ఇళ్లు మంజూరు చేసింది. గత ప్రభుత్వాలేవీ చేయలేని అభివృద్ధిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసి చూపించింది. ఇంతటి అభివృద్ధి చేసిన జగనన్నకు అండగా ఉంటాం.

– దొడ్డి సన్యాసినాయుడు,రైతు, కాసాపేట


జగనన్న కాలనీలో ప్రారంభమైన ఇళ్లు


రైతులకు అందుబాటులో నిర్మించిన ఆర్‌బీకే భవనం


కాసాపేట సచివాలయం

'పల్స్‌పోలియో'ను విజయవంతం చేయాలి


వీరఘట్టం: ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ సాల్మన్‌రాజ్

వీరఘట్టం: మార్చి 3న నిర్వహించే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజ్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వీరఘట్టం, బిటివాడ వైద్యాధికారులు డాక్టర్ ఉమామహేశ్వరి, నితీషా ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలతో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో వలంటీర్ల సహకారంతో ఐదేళ్లు లోపు చిన్నారులను గుర్తించి వారికి పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

- భామిని: వచ్చే నెల 3న నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని శాఖల అధికారులు సహకరించాలని భామిని పీహెచ్‌సీ వైద్యాధికారి సంతోషలక్ష్మి, సీహెచ్‌ఓ భాస్కరరావు కోరారు. భామినిలో ఈఓపీఆర్డీ కె.కృష్ణారావు ఆధ్వర్యంలో వివిధ శాఖల సిబ్బందితో సోమవారం సమావేశమయ్యారు. పల్స్‌పోలియో కార్యక్రమ ఏర్పాట్లుపై సమీక్షించారు. మండల పరిధిలో ఉన్న ఐదేళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేసేలా ఆరోగ్య సిబ్బంది కృషిచేయాలన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమం ఆవశ్యకతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఎంఈఓ వి.భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.


భామిని: సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి సంతోషలక్ష్మి

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం

సీతానగరం: ప్రభుత్వ వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా నివారణాధికారి (డీఎంఓ) టి. జగన్ మోహనరావు అన్నారు. మండలంలోని జోగింపేటలో ఉన్న గిరిజన, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, కేజీబీవీ మహిళల విద్యాలయంలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. అలాగే దోమల నివారణకు తీసుకోవాల్సిన అంశాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిక్ రికార్డులు, మందులను పరిశీలించారు. గురుకులం ప్రిన్సిపాల్ పోల వెంకటినాయుడు మాట్లాడుతూ.. వివిధ రకాల వ్యాధుల నివారణకు అవసరమైన మందులు ప్రభుత్వం సమకూర్చిందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, హెల్త్ సూపరువైజర్ శర్మ, వైద్య సిబ్బంది చైత్యన్య, లావణ్య, హరికృష్ణ పాల్గొన్నారు.


గురుకుల విద్యాలయంలో సిక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీఎంఓ జగన్ మోహనరావు

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

మక్కువ: వేతనదారులకు ఉపాధిహామీ పథకం బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగునాయుడు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి వేతనదారులు ఐదు వారాలుగా పనులు చేస్తున్నప్పటికీ ఇంతవరకు బిల్లులు అందలేదని, వేతనదారులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉపాధిహామీ పనులు సక్రమంగా చేపట్టడంతో పాటు బిల్లులు సకాలంలో చెల్లిస్తే వలసల నివారణ సాధ్యమవుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పి.సీతారాం, టి.ప్రభాకర్ పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు

నేడు నేరెళ్లవలసలో మెగా వైద్యశిబిరం

సాలూరు: మండలంలోని నేరెళ్లవలసలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు రూరల్ ఎస్సై వెంకటరమణ తెలిపారు. జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలతో రూరల్ సీఐ బాలకృష్ణ పర్యవేక్షణలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'వైఎస్సార్‌సీపీని గెలిపించాలి'

బలిజిపేట: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎ.రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని బర్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ, అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగమణి, మండల ఉపాధ్యక్షుడు సాయిరాం, ఎంపీటీసీ సభ్యురాలు జి.శారద, పి.నారాయణరావు, బి.కృష్ణ, పోల రామకృష్ణ, జి.మురళి, కె.వెంకటరమణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రణాళికల ఆధారంగా అభివృద్ధి పనులు

సీతానగరం: మండలంలోని గ్రామ పంచాయతీల్లో ప్రణాళికలు సిద్ధం చేసుకుని అభివృద్ధి పనులు చేపట్టాలని ఈఓపీఆర్డీ కె. కుమార వర్మ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అభివృద్ధి పనులతో పాటు తాగునీరు, పారిశుధ్యం, సామాజిక పరమైన అభివృద్ధి, జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని సూచించారు.

రూ.95 లక్షలతో బీటీ రోడ్డు

- నెరవేరిన వంతరాం ప్రజల ఏళ్ల నాటి కల

బలిజిపేట: వంతరాం నుంచి కొత్తవంతరాం వరకు బీటీ రోడ్డు నిర్మించడంతో అరవై ఏళ్ల నాటి కల సాకారమైంది. రూ.95 లక్షలతో 2.1 కిలోమీటర్ల మేర రోడ్డు వేశారు. ఎమ్మెల్యే అలజంగి జోగారావు కృషితో తమ గ్రామాల మధ్య రోడ్డు వేశారని వంతరాం, కొత్తవంతరాం గ్రామాల ప్రజలు చెబుతున్నారు. గత ప్రభుత్వాల దృష్టికి రహదారి సమస్య తీసుకెళ్లినా ఎవ్వరూ పట్టించుకోలేదని... వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఎమ్మెల్యే జోగారావు రోడ్డు వేశారని ప్రజలు తెలిపారు. గతంలో వర్షాకాలం అయితే గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయేవని, ఇకపై తమకు రవాణా కష్టాలు ఉండవని ఆయా గ్రామల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


వంతరాం - చిన వంతరాం మధ్య కొత్తగా నిర్మించిన బీటీ రోడ్డు

మట్టి రోడ్డుతో ఇబ్బందులు పడ్డాం..



నా చిన్ననాటి నుంచి మట్టిరోడ్డే ఉంది. ఎన్నో ప్రభుత్వాలు మారినా మా గ్రామానికి రోడ్డు మాత్రం వేయలేదు. గోతుల రోడ్డుపై రాకపోకలకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఎట్టకేలకు ఎమ్మెల్యే జోగారావు కృషి రహదారి సమస్య తీరింది. ముఖ్యమంత్రి జగన్‌బాబుకు, ఎమ్మెల్యే జోగారావుకు రుణపడి ఉంటాం.

– సీహెచ్ సత్యనారాయణ, కొత్త వంతరాం, బలిజిపేట మండలం

వ్యవసాయ కార్మికులందరికీ ఉపాధి పని

- మండల వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి ఈశ్వరరావు డిమాండ్

సీతానగరం: మండలంలోని వ్యవసాయ కార్మికులందరికీ ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని మండల వ్యవసాయ కార్మిక సంఘ కార్యదర్శి ఆర్. ఈశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో ఉపాధి ఏపీఓ భానుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో కొంతమందికే ఉపాధి పనులు కల్పించడంతో మిగిలినవారు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. పని కావల్సిన వారందరికీ జాబ్‌కార్డులు ఇచ్చి ఉపాధి కల్పించాలని కోరారు. ఏపీఓ భాను మాట్లాడుతూ.. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ సభ్యులు ఎం. వెంకటరమణ, జి. వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.


ఏపీఓ భానుకు వినతిపత్రం అందజేస్తున్న కార్మిక సంఘ కార్యదర్శి ఈశ్వరరావు

ఫిర్యాదులపై సత్వర న్యాయం

పార్వతీపురంటౌన్:

ఫిర్యాదులపై సత్వర న్యాయం జరగాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించి, వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వేధింపులు, కుటుంబ కలహాలు, సివిల్ తగాదాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదు దారులు స్వేచ్ఛగా విన్నవించుకోగా, వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీ సీఐ సీహెచ్ లక్ష్మణ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

వంద రోజుల పని కల్పించాలి

- డ్వామా పీడీ రామచంద్రరావు

సీతానగరం:

ఉపాధి వేతనదారులందరికీ వంద రోజుల ఉపాధి పని కల్పించాలని డ్వామా పీడీ కె. రామచంద్రరావు అన్నారు. మండల పరిషత్ కార్యలయంలో ఎంపీడీఓ ఎం. ఈశ్వరరావు ఆధ్వర్యంలో బలిజిపేట, సీతానగరం, పార్వతీపురం మండలాలకు చెందిన ఉపాధి ఏపీఓలు, జేఈలు, టెక్నికల్ సహాయకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల ప్రగతి, చేపట్టనున్న పనులు, వేతనదారుల హాజరు, కల్పించిన పనిదినాలు, తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జాబ్‌కార్డులున్న వేతన దారులందరికీ వంద రోజుల పని కల్పించే బాధ్యత ఏపీఓలు తీసుకోవాలన్నారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటలకు వేతనదారులకు మస్తర్లు వేసి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో గుర్తించిన పనులు చేపట్టి అవసరమైన వారందరికీ ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మూడు మండలాల ఏపీఓలు, జేఈలు, టెక్నికల్ సహాయకులు, క్షేత్ర సహాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు